భక్తిశ్రద్ధలతో ఊరేగింపులు, నిమజ్జనాలు


దెందులూరు : సుబ్బయ్యవీధిలో యూత్ ఆధ్వర్యంలో వినాయక ఊరేగింపు


భీమడోలు : కోలాహలంగా సాగిన లడ్డు డ్రా

భీమడోలు: గణేష్ ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజు గురువారం పలు గ్రామాల్లో స్వామివారి ఊరేగింపులు, నిమజ్జనాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భీమడోలు, గుండుగొలను, పూళ్ల, పోలసానిపల్లి, సూరప్పగూడెం, కొల్లేరు గ్రామాల్లో తీన్‌మార్ డప్పు వాయిద్యాల నడుమ సుందరంగా అలంకరించిన ట్రాక్టర్‌పై భారీ వినాయక విగ్రహాలను ఉంచి గ్రామోత్సవాలు నిర్వహించారు. గుండుగొలనులో భారీ విగ్రహానికి భక్తులు పూజలు చేశారు. అనంతరం ఆ విగ్రహాన్ని ఓ ట్రాక్టర్‌పై ఉంచి యువకుల నృత్య ప్రదర్శనలు, డీజే సౌండ్స్‌తో డప్పువాయిద్యాల నడుమ ఊరేగించారు. భీమడోలు పెరుమాళ్ల స్తంభం వద్ద ఏర్పాటు చేసిన శ్రీమహాగణపతి 12వ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం వినాయక విగ్రహాన్ని ట్రాక్టర్‌పై ఉంచి ఊరేగించారు. అనంతరం గోదావరి కాల్వలో నిమజ్జనం చేశారు. బుధవారం రాత్రి స్వామి వారికి లడ్డూ ప్రసాదానికి పాట నిర్వహించగా, గ్రామానికి చెందిన యెగ్గిన గంగాకమలాకర్ దక్కించుకున్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మద్దాల అప్పారావు, పెద్దలు మంచెం నాగు, తాటిమళ్ల రామ్మూర్తి, యువకులు పాల్గొన్నారు.

వైభవంగా గణనాథునికి పూజలు

గణపవరం: స్థానిక దండు మారెమ్మ ఆలయం వద్ద క్షత్రియయూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథునికి, వెలంపేట వెంకయ్యకాల్వ ఒడ్డున గణనాథునికి ప్రతీ రోజూ ప్రత్యేక పూజలు, అలంకరణలు చేశారు. గణపవరంలో గణనాథుని ఊరేగింపులు తీన్‌మార్ వాయిద్యాలు, డీజే సౌండ్లతో విచిత్రవేషాలు, బ్యాండు మేళాల నడుమ నిర్వహించారు. అన్నసమారాధనలు ఏర్పాటుచేశారు.


గణపవరంలో : గణేషుని ఊరేగింపు


భీమడోలు : ఆకట్టుకున్న శక్తి వేషధారుల విన్యాసాలు

ఉంగుటూరులో కోలాహలంగా ఊరేగింపు

ఉంగుటూరు: ఉంగుటూరులో వినాయకుని ఊరేగింపులు గురువారం కోలాహలంగా నిర్వహించారు. స్థానిక సంతబజారులోని ప్రధాన ఆలయంలోని వినాయక ప్రతిమను విడియాల పరమహంస, ఉండవల్లి సుబ్రహ్మణ్యం, కొండ్రెడ్డి శ్రీనుల ఆధ్వర్యంలో ఊరేగించారు. సుబ్బారాయుడు పేట, సాలిపేటల్లో వినాయక ప్రతిమను ఊరేగించారు. అప్పారావుపేట గ్రామంలో వినాయక మండపం వద్ద బళ్ల త్రిమూర్తులు వితరణతో అన్నసమారాధన నిర్వహించారు.


ఉంగుటూరు : సుబ్బారాయుడుపేట వినాయకుని ఊరేగింపు


భీమడోలులో : ట్రాక్టర్ రథంపై ఊరేగుతున్న భారీ గణనాథుడు

గణపతికి ప్రత్యేక పూజలు

దెందులూరు: మండలంలో వినాయకచవితి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. గురువారం పోతునూరు, కొవ్వలి, సోమవరప్పాడు, గంగన్నగూడెం, శ్రీరామవరం, రామారావుగూడెం, పెరుగ్గూడెం గ్రామాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. దెందులూరులో 9వ వార్డు యూత్ ఆధ్వర్యంలో స్వామివారి ప్రతిమను ట్రాక్టర్‌పై ఉంచి వివిధ వేషధారణలతో, డీజే సౌండ్స్ నడుమ గ్రామంలో ఊరేగించారు. అనంతరం గోదావరి కాలువలో నిమజ్జనం చేశారు.


భీమడోలు : గుండుగొలనులో గణేష్ విగ్రహ ఊరేగింపు


దెందులూరు : 9వ వార్డు యూత్ ఆధ్వర్యంలో ఊరేగింపు

జాలిపూడిలో విద్యుత్ బిల్లుల మోత

దెందులూరు: కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత విద్యుత్ బిల్లుల మోత మోగుతోంది. వర్షాకాలంలో సైతం నెలకు పెద్ద మొత్తంలో బిల్లులు రావడం ఏమిటని వినియోగదారులు వాపోతున్నారు. ఏలూరు మండలం జాలిపూడికి చెందిన కె.నాగేషు మాట్లాడుతూ తన ఇంటికి ఎప్పుడూ రూ.800 నుంచి రూ.1500లు మాత్రమే నెలవారీ బిల్లు వచ్చేందని, ఆగస్టు నెలలో రూ.2800 వచ్చిందని తెలిపారు. తన వీధిలో ఐదు ఇళ్లలకు రూ.2800 చొప్పున విద్యుత్ బిల్లు వచ్చిందని వాపోయారు. విద్యుత్‌శాఖ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌కు ఆధారాలతో ఫిర్యాదు చేస్తామని బాధితులు తెలిపారు.

సమాజాభివృద్ధికి పాటుపడాలి


బహుమతులు అందుకున్న విజేతలు

ఉంగుటూరు: చదువుతోపాటు సమాజాభివృద్ధికి పాటుపడాలని నారాయణపురం ఎస్ఏఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు రెడ్డియ్య అన్నారు. గురువారం ఆ కాలేజీలో మెదటి సంవత్సరం విద్యార్థులకు స్వాగతం (దీక్షారంబ్), ఇండక్షన్ పోగ్రాం ఐక్యు, అకడామిక్ సెల్ ఆధ్వర్యంలో రెడ్డియ్య అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో డాక్టరు కొండారవి మాట్లాడుతూ యాంటీ ర్యాంగింగ్ సెల్, జాతీయ సేవా పథకాల పనితీరును వివరించారు. సీనియర్ న్యాయవాది కూనా కృష్ణారావు న్యాయసేవా విభాగం ద్వారా ఉచిత సర్వీసులు పొందే అవకాశం ఉందని అన్నారు. సైబర్ నేరాల్లో యువత ఎలా చిక్కుకుంటుందో వివరించారు. లేళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మహిళలకు భద్రత, రక్షణ కల్పించడం మనందరి బాధ్యతని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు గ్రంథాలయ సంఘం ద్వారా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు వక్తలు బహుమతులు ప్రదానం చేశారు. కళాశాల అధ్యాపకులు రామ్మోహనరావు, ఫణీంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఐరన్ మాత్రల పంపిణీ


విద్యార్థినికి ఐరన్ మాత్ర వేస్తున్న హెచ్‌ఎం ప్రసాద్

గణపవరం: విద్యార్థులు రక్తహీనత కలిగి ఉంటే చదువులో వెనుకబాటుకు గురవుతారని, అందువల్ల ఐరన్ మాత్రలు క్రమం తప్పకుండా వేసుకోవాలని గణపవరం మండలం కాశిపాడు జెడ్పీహెచ్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్ అన్నారు. గురువారం పాఠశాలలో విద్యార్థులకు వైద్య సిబ్బంది ఐరన్ మాత్రలు పంపిణీ చేశారు. రక్తహీనత రాకుండా ప్రభుత్వం విద్యార్థులకు రాగిజావ, వేరుశెనగబెల్లం చిక్కీలను అందిస్తుందని ప్రసాద్ తెలిపారు. ఆరోగ్య సహాయకుడు నామాలరాజు మాట్లాడుతూ రక్తహీనత రాకుండా ఆకుకూరలు, తాజా పండ్లు ఎక్కువగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలసదనం పరిశీలన


దెందులూరులో బాలసదనంలో చిన్నారితో మాట్లాడుతున్న నోడల్ అధికారి స్వరాజ్యలక్ష్మి

దెందులూరు: స్థానిక బాల సదనాన్ని ఐసీడీఎస్ నోడల్ అధికారి కె.స్వరాజ్యలక్ష్మి గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి మరుగు దొడ్లు, బెడ్లు, విద్యుత్, తాగునీరు, నాలుగువైపులా ప్రహరీ, భవన పటిష్టతను పరిశీలించారు. సిబ్బంది, విద్యార్థులతో మాట్లాడారు. భోజన రుచి, నాణ్యతపై ఆరా తీశారు. వంట షెడ్డును పరిశీలించారు. స్వరాజ్యలక్ష్మి మాట్లాడుతూ బాలసదనం విద్యార్థులకు ప్రభుత్వం ద్వారా అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. మిషన్ వాత్సల్యంలో ఉన్న అన్ని ఐటమ్స్ సమర్థవంతంగా అమలు చేసి, జిల్లాలో నిరాదరణకు గురైన బాలలను ఆదరించాలని సూపరింటెండెంట్ బేబీ సరోజినికి సూచించారు. ఆమె వెంట డీసీపీఓ డాక్టర్ సూర్యచక్రవేణి ఉన్నారు.

విరాళాల సేకరణ


గణపవరంలో విరాళాలు సేకరిస్తున్న నాయకులు

గణపవరం: వరద బాధితులను ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు విజ్ఞప్తి చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో గురువారం గణపవరంలో వ్యాపార సంస్థలు, ఇళ్ల వద్ద ప్రజల నుంచి విరాళాలను సేకరించారు. కార్యక్రమంలో నాయకులు కలిశెట్టి వెంకట్రావు, సీతారాం ప్రసాద్, టి.శ్రీనివాస్, పల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్‌కు స్థల పరిశీలన


పోతునూరులో స్థల పరిశీలన చేస్తున్న అధికారులు

దెందులూరు: మండలంలోని పోతునూరులో పెట్రోలు బంకు నిర్మాణానికి స్థలాన్ని ఆర్డీఓ షేక్ ఖాజావలీ, తహసీల్దార్ బి.సుమతి పరిశీలించారు. రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. స్థల వివరాలను తహసీల్దార్‌ను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట ఆర్ఐ హేమమాలిని, వీఆర్ఓ బోదుల శ్రీనివాస్, స్థల యజమాని రాజా ఉన్నారు.

రైస్‌మిల్లుల్లో తనిఖీ


రైస్‌మిల్లుల్లో రికార్డులు పరిశీలిస్తున్న తహసీల్దార్ సుమతి

దెందులూరు: రైస్‌మిల్లు నిర్వహణ సక్రమంగా ఉండాలని తహసీల్దార్ బి.సుమతి అన్నారు. గురువారం కొవ్వలిలో విజయలక్ష్మి రైస్ మిల్లులో ఆమె తనిఖీ నిర్వహించారు. మిల్లులో స్టాక్, రిజిష్టర్‌లను పరిశీలించారు. తహసీల్దార్ వెంట ఆర్ఐ హేమమాలిని, వీఆర్ఓలు రామకృష్ణ, కిషోర్ ఉన్నారు.

విలీన మండలాల కూలీలను ఆదుకోవాలి

కుక్కునూరు: గోదావరి వరదలు, భారీ వర్షాలతో అల్లాడుతున్న కుక్కునూరు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి వ్యవసాయ కార్మికులకు జీవన భృతి కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కురాకుల బాబురావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మిక కుటుంబాలకు బియ్యంతో పాటు నిత్యావసర వస్తువులను ఉచితంగా అందించాలని కోరారు. వరద బాధితులకు నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి


యూడైస్ ప్లస్, స్కూల్ యాజమాన్య కమిటీ వివరాల నమోదుపై అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఎం పాశం

భీమడోలు: బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాల్సిన బాధ్యత ప్రధానోపాధ్యాయులదేనని ఎంఈఓ-1 ఈదుపల్లి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ఎంఆర్సీలో గురువారం విద్యా విషయాక అంశాలపై ప్రధానోపాధ్యాయులతో సమావేశం ఎంఈఓ-1 శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. ఎంఈఓ-2 అయినపర్తి భాస్కర్‌కుమార్ యూడైస్ ప్లస్, ఎండీఎం, పరీక్షల మూల్యాంకనం, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై సమీక్షించారు. ఎంఈఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ పిల్లలందర్నీ పాఠశాలల్లో చేర్పించాలని, బడికి దూరంగా ఉన్న వారిని ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో చేర్పించాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. యూడైస్ ప్లస్‌లో పాఠశాలల్లోని ప్రతి విద్యార్థి పక్కా సమాచారాన్ని పొందుపర్చాలని, ఆధార్ నెంబర్, వారి ఫోన్ నెంబర్ ఉండేలా చూసుకోవాలని అన్నారు. కోడిగుడ్ల నాణ్యతను పరిశీలించిన తర్వాతే విద్యార్థులకు అందించాలని, పాడైన కోడిగుడ్లు, బరువు తక్కువ కోడిగుడ్లను తీసుకోవద్దని తెలిపారు. పాఠశాలల్లో శానిటేషన్ ఫొటోలను అప్‌లోడ్ చేయాలని, ఇటీవల జరిగిన పరీక్షల మూల్యాంకనపు ఫలితాలను నమోదు చేయాలని అన్నారు. నవోదయ, నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిఫ్ పరీక్షలు రాసే వారి సంఖ్యను పెంచాలని తెలిపారు. తొలుత యుడైస్ ప్లస్, స్కూల్ యాజమాన్య కమిటీ వివరాల ఆన్‌లైన్ చేసే విధానంపై హెచ్‌ఎం పాశం పాండురంగారావు టీచర్లకు వివరించారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాలల హెచ్‌ఎం, సీఆర్‌ఎంటీలు పాల్గొన్నారు.

రైల్వే అండర్ పాస్‌తో అవస్థలు

దెందులూరు: దెందులూరు – అలుగులగూడెం వద్ద కోట్లాది రూపాయలతో నిర్మించిన అండర్‌పాస్‌లో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అండర్‌పాస్ నిర్మించి దాదాపు ఆరు నెలలు కావస్తున్నా పూర్తిస్థాయిలో పై కప్పు రేకు అలుగులగూడెం వైపు వేయలేదు. సాయంత్రం 5 గంటలు దాటితే విద్యుత్ లేక ఆప్రాంతమంతా చీకటిమయంగా మారుతుంది. వర్షాలకు అండర్‌పాస్‌లో నీరు నిలిచి తేళ్లు, పాములు, ఉడుములు సంచరిస్తున్నాయి. అండర్‌పాస్‌లో పెట్టిన మట్టిని తీయకపోవడంతో మోటారు బిగించినా నీరు లాగడం లేదు. దీనికి తోడు డీజిల్ ఇంజిన్, ఎలక్ట్రికల్ మోటారు పూర్తిస్థాయిలో పనిచేయడం లేదు. అండర్‌పాస్ పక్కన రైల్వే ట్రాక్ వరకు రోడ్డు నడవటానికి వీల్లేకుండా ఉంది. ఈ సమస్యలపై రైల్వే అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. సమస్యను రైల్వే జనరల్ మేనేజర్ సికింద్రాబాద్, ఢిల్లీలో ఉన్నతాధికారులకు వీడియోలు పంపిస్తామని అలుగులగూడెం, సానిగూడెం, దెందులూరు, గాలాయగూడెం, గోపన్నపాలెం గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు.


అండర్‌పాస్‌లో తొలగని నీరు

బియ్యం, దుస్తుల పంపిణీ


గోగుంట గ్రామంలో దుస్తులు, బియ్యం పంపిణీ చేస్తున్న దాతలు

వరద బాధితులకు విద్యార్థుల సాయం

పెదపాడు : వరద బాధితులకు విద్యార్థుల సాయం అందించడం గొప్ప విషయమని వికార్ జనరల్ ఫాదర్ బాల, సెయింట్ జోషఫ్ డెంటల్ కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ మోజేష్ అన్నారు. గురువారం పెదపాడు మండలం గోగుంట గ్రామంలో ఏలూరు సోషల్ సర్వీస్ సెంటర్ చైర్మన్ ఫాదర్ బిషప్ పొలిమేర జయరావు ఆదేశాల మేరకు డైరక్టరు ఇమ్మానియేలు ఆధ్వర్యంలో వరద బాధితులకు సెయింట్ థెరిస్సా విద్యార్థులు అందించిన సాయంతో ఒక్కొరికీ ఏడు కేజీల బియ్యం, సెయింట్ జోషఫ్ డెంటల్ కళాశాల, నర్సింగ్ కళాశాల విద్యార్థులు అందించిన సాయంతో చీర, లుంగీ, రెండు సబ్బులు, రెండు షాంపులు చొప్పున 106 కుటుంబాలకు అందించారు. ఫాదర్లు జేకబ్, ఐ.మైకేల్, మిల్కియార్, ఎం రాజు, సిస్టర్ క్రిస్టియా పాల్గొన్నారు.


విరాళాలు అందిస్తున్న ఉప్పాకపాడు విద్యార్థులు

వరద బాధితులకు విద్యార్థుల విరాళం

ఉంగుటూరు: విజయవాడ వరద బాధితులకు ఉప్పాకపాడు పాఠశాల విద్యార్థులు 15 వేలు సేకరించారు. మూడు రోజులుగా గ్రామంలో వారు విరాళాలు సేకరించారు.

ఎమ్మెల్యేకి విరాళాల అందజేత

ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజుకు వరద బాధితుల కోసం గురువారం యర్రమళ్లకు చెందిన కాజ సత్యనారాయణ గ్రామస్తుల తరపున రూ.47,300 అందజేశారు. గొల్లగూడెం సూర్య హైస్కూల్ తరపున వేములపల్లి సుధీర్, చైతన్యలు రూ.70 వేలు, గొల్లగూడెం సర్పంచ్ కరపాశ్రీను, నెక్కలపూడి సత్యనారాయణ, వేములపల్లి సుధీర్, దాసరి శేఖర్ ఆధ్వర్యంలో గ్రామస్తులు రూ.3,41,000 ఎమ్మెల్యేకి అందజేశారు. అప్పారావుపేట గ్రామస్తులు రూ.29,148, నారాయణపురం ముదునూరి నర్సిహరాజు రూ.10 వేలు ఎమ్మెల్యేకి అందజేశారు.

కుటుంబరావు లేని లోటు తీరనిది

దెందులూరు: వైఎస్సార్ సీపీ ఖండ్రికనర్సింహాపురం సీనియర్ నేత సరిపల్లి కుటుంబరావు ఆకస్మిక మృతి తీరని లోటని ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు అన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచీ క్రమశిక్షణ, పార్టీ అభివృద్ధే లక్ష్యంగా సేవలందించారని గుర్తుచేశారు. పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పల్లెం ప్రసాద్, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షులు తేరా ఆనంద్, ఏఎంసీ మాజీ చైర్మన్ కాటి సుధాకర్, సర్పంచ్‌లు యలమర్తి రేవతి, బైగాని వెంకటేశ్వరమ్మ, పరసా లక్ష్మిసుజాతలు సరిపల్లి కుటుంబరావు మృతికి సంతాపం వ్యక్తం చేశారు.

పౌష్టికాహార లోపంతోనే ఎనీమియా

ఏలూరు (టూటౌన్): గర్భిణులు, బాలింతల్లో పౌష్టికాహార లోపం వల్లే ఎనీమియా వ్యాధి వస్తుందని సీడీపీఓ ఎ.పద్మావతి అన్నారు. స్థానిక 35వ డివిజన్ గానుగుల పేట అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పౌష్టికాహార మాసోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీడీపీఓ పద్మావతి మాట్లాడుతూ పౌష్టికాహారం ఆవశ్యకతను వివరించారు.

ఏచూరి మృతి తీరనిలోటు


నిడమర్రు: ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నేతలు

గణపవరం: సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారం ఏచూరి మృతి ఉద్యమానికి, దేశానికి తీరనిలోటని పలువురు పేర్కొన్నారు. గురువారం ఆయన మృతికి గణపవరంలో సీపీఎం అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో సంతాపం వ్యక్తం చేశారు. సీతారాం అమర్‌రహే అంటూ నినదించారు. కార్యక్రమంలో నాయకులు పచ్చిపులుసు గోవింద్, నారపల్లి రమణ, డి.రామలింగరాజు, కోన శ్రీనివాసరావు, గవర సత్యనారాయణ, సుబ్రహ్మణ్యం, సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ కమ్యూనిస్టు ఏచూరి

నిడమర్రు: ఆదర్శ కమ్యూనిస్టు సీతారం ఏచూరి అని సీపీఎం మండల కన్వీనర్ నారపల్లి రమణారావు అన్నారు. గురువారం బువ్వనపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో ఏచూరికి సంతాపం వ్యక్తం చేశారు. సీతారం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కోన శ్రీనివాసరావు, గవర సత్యనారాయణ, వెలగలేటి మోహన, కానూరు రాజు పాల్గొన్నారు.

వరద నష్టం నమోదు పూర్తిచేయాలి

పెదపాడు : వరద నష్టాల అంచనాలను రెండు రోజుల్లో పూర్తి చేయాలని ఆర్డీవో ఎస్ఎస్‌కే ఖాజావలి అధికారులను ఆదేశించారు. గురువారం పెదపాడు మండలం అప్పనవీడు సచివాలయంలో పంట నష్టాల నమోదు ప్రక్రియను పరిశీలించారు. పంట, పశు, ఇళ్ల నష్టాలపై ఆరా తీశారు. వరదల వల్ల పంట నష్టం అంచనా వేయడానికి ప్రత్యేక యాప్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తెలిపారు. వరద నష్టాలు, బాధితుల డేటా యాప్‌లో నమోదు చేశామన్నారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ డి.ప్రసాద్, వీఆర్వోలు సాంబశివరావు, కరీం పాల్గొన్నారు.


వరద నష్టాలను అంచనాలను పరిశీలిస్తున్న ఆర్డీఓ ఖాజావలి

ఆటల పోటీలు ప్రారంభం

జంగారెడ్డిగూడెం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి ఆటల పోటీలు గురువారం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో ప్రారంభమయ్యాయి. స్కూల్ గేమ్స్ మండల కో–ఆర్డినేటర్, పీడీ ఎల్.జయరాజు మాట్లాడుతూ అండర్–11, అండర్–14, అండర్–17, అండర్–19 విభాగాల్లో వివిధ అంశాల్లో ఎంపికలు నిర్వహించామన్నారు. రెండు రోజులు నిర్వహించే ఎంపికల్లో భాగంగా గురువారం అథ్లెటిక్స్, యోగా, చెస్, షటిల్, బాడ్మింటిన్ పోటీల్లో ఎంపికలు నిర్వహించామన్నారు.

పుల్లారావు మృతి తీరనిలోటు


పుల్లారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీచైర్మన్ గంటా పద్మశ్రీ

గణపవరం: సీనియర్ నాయకుడు, బువ్వనపలి మాజీ సర్పంచ్ సంకు పుల్లారావు మృతి తీరనిలోటని పలువురు పేర్కొన్నారు. పుల్లారావు అల్లుడు, మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబును పరామర్శించారు. గురువారం వారు పుల్లారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ ఆవిర్భావం నుంచి ఆపార్టీలో వివిధ పదవుల్లో పనిచేసిన పుల్లారావు అనంతరం వైఎస్సార్ సీపీలో చేరారు. పుల్లారావు గ్రామాభివృద్ధికి, గ్రామదేవత వడలమ్మ ఆలయ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. జెడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ ప్రసాదరావు, ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు, నాలుగు మండలాల ఎంపీటీసీలు, జెడ్పీటీసీ సభ్యులు, వైఎస్సార్ సీపీ కన్వీనర్‌లు, నాయకులు వాసుబాబును పరామర్శించారు.

14న కృతజ్ఞత స్తుతి కూడిక

దెందులూరు: కొవ్వలి గ్రామంలో ఈ నెల 14న బేతేలు ప్రార్థన మందిరంలో కృతజ్ఞత స్తుతి కూడిక నిర్వహించనున్నట్టు నిర్వాహకుడు, బేతేలు ప్రార్థనా మందిర ఫాస్టర్ సీహెచ్ విలియం తెలిపారు. సువార్తీకులు ఉదయభాస్కర్ విచ్చేస్తారని, సమీప గ్రామాల్లోని భక్తులు ఈ కూడికకు హాజరుకావాలని కోరారు.